సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
19వ వసంతంలోకి..

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4 PM
www.suryaa.com
శనివారం
22-11-2025
పేజీలు: 02




## శత్రువును మిత్రుడిగా మార్చాడు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ — న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన జోహ్రాన్ మమ్దానీ శుక్రవారం (నవంబర్ 21) శ్వేతసౌధంలో తమ తొలి సమావేశాన్ని నిర్వహించారు. ఇద్దరు నాయకుల స్వరం ఎన్నికల ఘర్షణ నుండి ఇప్పుడిప్పుడే బయటకు వచ్చినట్లు సూచిస్తుంది. ట్రంప్ క్లోజ్డ్ డోర్ సమావేశాన్ని గొప్పగా జరిగిందని అభివర్ణించారు. చర్చల సందర్భంగా అనేక కీలక అంశాలపై ఏకాభిప్రాయం కుదిరింది. ట్రంప్-మమ్దానీ సంయుక్త ఎజెండాకు మద్దతు ఇస్తానని కూడా ప్రతిజ్ఞ చేశారు. న్యూ యార్క్ మేయర్‌గా ఎన్నికైన డెమొక్రటిక్ సోషలిస్ట్, ఇండో అమెరికన్ జొహ్రాన్ మమ్దాని.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వైట్‌హౌస్‌లో భేటీ అయ్యారు. అయితే న్యూయార్క్ మేయర్‌గా మామ్దాని ఎన్నిక కావడానికి ముందు, ఆ తర్వాత ఆయనపై ట్రంప్ తీవ్ర విమర్శలు చేశారు. అతనొక కమ్యూనిస్టు అని ఒకవైపు, అతడి పేరు ఎదైనా కావొచ్చు, అతడు ఎవరైతే నాకేంటి అని ట్రంప్ హేళన చేశారు. ఇదే విషయమై ఓ న్యూస్ రిపోర్టర్ ప్రశ్నించారు. అయితే మమ్దాని సమాధానం ఇస్తున్నా.. ట్రంప్ మాత్రం ఆయన్ను అడ్డుకొని మరీ- దట్స్ ఓకే అంటూ మాట దాటవేశారు. అమెరికా రాజకీయాల్లో ట్రంప్, మమ్దానీ భేటీ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

# యూకేలో శాశ్వత నివాస అనుమతి గడువు రెట్టింపు



యూకే ప్రభుత్వం అంతర్జాతీయ వలసదారుల విధానంలో అత్యంత కీలకమైన, కఠినమైన మార్పును తీసుకురావడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా భారత్‌తో సహా వివిధ దేశాల నుంచి వచ్చిన వలసదారులు శాశ్వత నివాస అనుమతి కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఉండే గడువును రెట్టింపు చేస్తూ ప్రతిపాదనను సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదనను గురువారం యూకే పార్లమెంటులో హోం మంత్రి షబానా మహమూద్ ప్రవేశపెట్టారు. కొత్తగా తీసుకురానున్న 'ఎర్న్‌డ్ సెటిల్‌మెంట్' మోడల్‌లో భాగంగా ఈ మార్పులు అమలులోకి రానున్నాయి. ఇప్పటి వరకు వలసదారులకు ఐదేళ్ల నివాసం తర్వాత ఆటోమేటిక్‌గా లభిస్తున్న ఐఎల్‌ఆర్ (ఐఎల్ఆర్) విధానాన్ని రద్దు చేసి, ఈ గడువును కనీసం పదేళ్లకు పెంచుతున్నట్లు హోం మంత్రి షబానా ధ్రువీకరించారు. ఈ నిర్ణయం బ్రిటన్‌లో పని చేస్తున్న లక్షలాది మంది భారతీయ నిపుణులపై, విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావాన్ని చూపనుంది. ఈ కొత్త ప్రతిపాదనలు వలసదారులను వారి ఆదాయం, వృత్తి ఆధారంగా వివిధ వర్గాలుగా విభజిస్తున్నాయి. నిరీక్షణ సమయాన్ని అమాంతం పెంచాయి. తక్కువ వేతనం ఉన్న ఉద్యోగులు శాశ్వత నివాసం పొందాలంటే 15 ఏళ్ల సుదీర్ఘ కాలం వేచి ఉండాల్సి ఉంటుంది. అలాగే ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతున్న వలసదారులు ఏకంగా 20 ఏళ్ల పాటు నివాస అనుమతి కోసం నిరీక్షించాల్సి ఉంటుంది. ఇక సాధారణ నిపుణులకు ఆటోమేటిక్ గడువు ఐదేళ్ల నుంచి పదేళ్ల వరకు పెరిగే అవకాశం ఉంది. అయితే యూకే ఆర్థిక వ్యవస్థకు, ప్రజా ఆరోగ్యానికి కీలకమైన రంగాల్లో పనిచేస్తున్న నిపుణులకు ఈ కొత్త నిబంధనల్లో మినహాయింపులు లభించనున్నాయి. నేషనల్ హెల్త్ సర్వీస్ వంటి కీలక రంగాల్లో పనిచేసే నిపుణులు, అలాగే ఎక్కువ సంపాదన ఉన్న వ్యాపారవేత్తలకు ఈ కఠినమైన నిబంధనలు వర్తించవు. వీరు ఐదేళ్లు లేదా అంతకంటే తక్కువ సమయంలోనే శాశ్వత నివాస అనుమతి పొందేందుకు మార్గం అందుబాటులో ఉంటుంది. యూకేలో వలసల సంఖ్యను తగ్గించడం, దేశానికి అత్యధిక ఆర్థిక విలువను అందించే నిపుణులను మాత్రమే ఆకర్షించడం ఈ కొత్త విధానం యొక్క ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. వలసదారుల సంఖ్యను అదుపు చేయాలనే ఓటర్ల ఒత్తిడి, రాజకీయ పార్టీల వాగ్దానాల నేపథ్యంలోనే యూకే ప్రభుత్వం ఈ చారిత్రక మార్పును తీసుకొచ్చింది. ఈ కఠిన నిబంధనలు ఆమోదం పొందితే.. యూకేలో తమ భవిష్యత్తు గురించి ఆశలు పెట్టుకున్న వేలాది మంది భారతీయులు తమ ప్రణాళికలను పునఃపరిశీలించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది.



## అమెరికాలో భారత వస్తువులకు డిమాండ్!

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్, భారత్‌ను శత్రుదేశంగా పరిగణిస్తూ భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారు. భారత ఎగుమతులపై 50 శాతం టారిఫ్‌లు విధించినా, అమెరికన్లు మాత్రం భారతీయ వస్తువులనే ఎక్కువగా నమ్ముతున్నారు. ధరలు పెరిగినా కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో అక్టోబర్‌లో భారత ఎగుమతులు 14 శాతం పెరిగాయి. ట్రంప్ ఆదేశాలను వ్యాపారులు పాటించకపోవడంతో, భారతీయుల స్థానంలో అమెరికన్లను నియమించుకోవాలనే ఆదేశాలు కూడా అమలు కావడం లేదని తెలుస్తోంది.



## మళ్లీ పోటీ చేసేది నేనే: కడియం శ్రీహరి

పార్టీ ఫిరాయింపులపై స్పీకర్ విచారణ వేగవంతం నేపథ్యంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన రాజీనామాపై కీలక వ్యాఖ్యలు చేశారు. స్పీకర్ నిర్ణయం మేరకు తన నిర్ణయం ఉంటుందని, నియోజకవర్గ ప్రజలు, న్యాయనిపుణులతో చర్చిస్తున్నానని తెలిపారు. ఒకవేళ ఉప ఎన్నిక వచ్చినా తానే పోటీ చేస్తానని, ప్రజలు గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పార్టీ ఫిరాయింపులపై వివరణ ఇవ్వాలని స్పీకర్ నోటీసులు ఇవ్వగా, కడియం శ్రీహరి స్పీకర్‌ను కలిసి మరికొంత సమయం కోరారు.




### బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 115 స్పెషలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగాలు..

## ₹1.20 లక్షల వరకు జీతం!

బ్యాంక్ ఆఫ్ ఇండియా (BOI) స్పెషలిస్ట్ ఆఫీసర్ (SO) పోస్టుల భర్తీకి భారీ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 115 ఖాళీలను ఈ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఐటీ, డేటా అనలిటిక్స్, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో నైపుణ్యం ఉన్న అభ్యర్థులకు ఇది అద్భుతమైన అవకాశం. ప్రభుత్వ రంగ బ్యాంకులో స్థిరమైన కెరీర్ కోసం చూస్తున్న వాళ్లు ఈ అవకాశాన్ని అస్సలు మిస్ చేయొద్దు. అర్హతల విషయానికొస్తే B.Tech, B.E, M.Tech, MCA, MSc (సంబంధిత స్పెషలైజేషన్‌తో) పూర్తి చేసిన వాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చు. పోస్టు మరియు స్పెషలైజేషన్ ఆధారంగా అర్హతలు కొద్దిగా మారవచ్చు. దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు తేదీ నవంబరు 30, 2025. ఆసక్తి ఉన్న అభ్యర్థులు త్వరగా అప్లై చేసుకోవడం మంచిది, లాస్ట్ డేట్ దగ్గర పడుతుంది. ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుంది — ముందుగా ఆన్‌లైన్ రాత పరీక్ష, తర్వాత పర్సనల్ ఇంటర్వ్యూ. రాత పరీక్షలో ప్రొఫెషనల్ నాలెడ్జ్, ఇంగ్లీష్, రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ సెక్షన్లు ఉంటాయి. ఈ దశలో మెరిట్ సాధించిన వాళ్లకు మంచి స్కేల్-1 మరియు స్కేల-2 జీతం లభిస్తుంది. ప్రారంభ జీతం రూ.64,820 నుంచి గరిష్ఠంగా రూ.1,20,940 వరకు ఉంటుంది (DA, HRA సహా). దరఖాస్తు ఫీజు జనరల్/OBC/EWS అభ్యర్థులకు రూ.850, అయితే SC/ST/PWBD అభ్యర్థులకు కేవలం రూ.175 మాత్రమే. అధికారిక వెబ్‌సైట్ https://bankofindia.bank.in లో ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి.

### సింగరేణి ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల బంపర్ ఛాన్స్.. 82 పోస్టులు, ఇంటర్నల్ క్యాండిడేట్స్‌కు మాత్రమే!

సింగరేణి కొల్లిరీస్ లిమిటెడ్ లో ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో 82 కీలక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జోరుగా సాగుతోంది. ఈ అవకాశం కంపెనీ ఇంటర్నల్ ఉద్యోగులకు మాత్రమే పరిమితం చేయడం వల్ల పోటీ తక్కువగా ఉండే అవకాశం ఉంది. అర్హత ఉన్నవారు ఈ అరుదైన అవకాశాన్ని అస్సలు మిస్ చేసుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. అర్హులైన అభ్యర్థులు నవంబర్ 24, 2025 సాయంత్రం వరకు తప్పనిసరిగా అప్లై చేసుకోవాలి. ఆ తర్వాత దరఖాస్తు హార్డ్ కాపీని అన్ని డాక్యుమెంట్లతో కలిపి నవంబర్ 26, 2025 లోపు సింగరేణి అధికారులకు చేరేలా పంపాలి. ఆలస్యమైతే దరఖాస్తు తిరస్కరణకు గురవుతుంది. ఈ పోస్టులకు ఎంపికైతే బేసిక్ శాలరీ నెలకు రూ.50,000గా నిర్ణయించారు. ఇందులో డియర్‌నెస్ అలవెన్స్, హెచ్‌ఆర్‌ఏ, మెడికల్, ఎల్‌టీసీ వంటి ఇతర అలవెన్సులు కలిపితే మొత్తం ప్యాకేజీ చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. ప్రభుత్వ రంగ సంస్థ కావడంతో ఉద్యోగ భద్రత, పెన్షన్ సౌకర్యం కూడా లభిస్తాయి. అర్హతలు, ఖాళీల వివరాలు, దరఖాస్తు ఫార్మాట్‌తో సహా పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్ www.scclmines.comలో అందుబాటులో ఉన్నాయి. ఇంటర్నల్ అభ్యర్థులు వెంటనే లాగిన్ అయి దరఖాస్తు చేసుకోవడం మంచిది — ఈ అవకాశం మళ్లీ రాకపోవచ్చు!

ONE FAMILY. ONE VISION. ONE MISSION
THE SINGARENI COLLIERIES COMPANY LIMITED
SCCL



## అమెరికాలో H5N5 బర్డ్‌ఫ్లూతో వ్యక్తి మృతి

అరుదైన H5N5 బర్డ్ ఫ్లూ వైరస్‌తో అమెరికాలో ఓ వ్యక్తి మరణించినట్లు తెలుస్తోంది. అయితే ఆ వైరస్ వల్ల ప్రస్తుతానికి పబ్లిక్‌కు ఎటువంటి రిస్క్ లేదని అధికారులు చెప్పారు. వాషింగ్టన్‌కు చెందిన ఆ వ్యక్తికి కొన్నాళ్లుగా ఆరోగ్యం సరిగా లేదు. H5N5 వైరస్ సోకిన తొలి అమెరికా వ్యక్తిగా అతన్ని గుర్తిస్తున్నారు. దీనిపై వాషింగ్టన్ ఆరోగ్యశాఖ ప్రకటన చేసింది. సియాటిల్‌కు 125 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రేస్ హార్బర్ కౌంటీకి ఆ వ్యక్తి చెందినట్లు చెబుతున్నారు. అతని ఇంటి వద్ద పౌల్ట్రీ ఉన్నట్లు తెలుస్తోంది. బర్డ్స్‌కు ఎక్స్‌పోజ్ కావడం వల్ల వైరస్ సోకి ఉంటుందని అనుమానిస్తున్నారు. వైరస్ పరీక్షలో ఏవియన్ ఇన్‌ఫ్లూయాంజా పాజిటివ్ వచ్చినవాళ్లు ఎవరూ లేరని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వైరస్ సోకిన వ్యక్తితో కాంటాక్ట్‌లోకి వచ్చిన ప్రతి ఒక్కరినీ పరీక్షించనున్నారు.



## బాలుడి విక్రయం.. 15 మందిపై కేసు నమోదు

హైదరాబాద్‌లో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన ఓ యువతి ప్రేమించిన వ్యక్తి మోసం చేయడంతో గర్భవతి అయి.. ఓ బాలుడికి జన్మనిచ్చింది. అయితే కరీంనగర్‌కు చెందిన దంపతులకు రూ.6 లక్షలకు ఆమె తమ బాలుడిని విక్రయించేందుకు ప్రయత్నించింది. ఈ విషయం బాలల పరిరక్షణ కమిటీకి తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి బాలుడిని స్వాధీనం చేసుకుని, ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న 15 మందిపై కేసు నమోదు చేశారు.




## అందాలు ఆరబోస్తున్న మాళవిక మోహనన్

ఏడు పదుల వయసులో కూడా ఇంకా కుర్రాడిలా కనిపించాలని తపన పడుతున్నారు మన సీనియర్ హీరోలు. అక్కినేని నాగార్జున, కాస్త రూటు మార్చి క్యారెక్టర్ వేషాలు వేస్తుంటే, నందమూరి బాలకృష్ణ.. సీనియర్ హీరోల్లో సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ఫ్యామిలీ ఆడియెన్స్ పల్స్ పట్టుకున్న విక్టరీ వెంకటేష్, 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీతో బ్లాక్ బస్టర్ కొట్టాడు. అయితే సీనియర్ హీరోల్లో కమ్‌బ్యాక్ కోసం కష్టపడుతున్న హీరో మెగాస్టార్ చిరంజీవి. 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి నటించిన 'భోళా శంకర్' ఎపిక్ డిజాస్టర్‌గా నిలిచింది. ఆ తర్వాత చిరూ మొదలెట్టిన 'విశ్వంభర' మూవీ, వాయిదాల మీద వాయిదాలు పడుతూ 2026 ఏడాదికి వెళ్లింది....వెంకీ స్టైల్‌లో తాను కూడా ఫ్యామిలీ ఆడియెన్స్‌ని మెప్పించే కథతో కమ్‌బ్యాక్ ఇవ్వాలని ఆశిస్తున్న చిరంజీవి, అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మన శంకర వరప్రసాద్ గారు' మూవీ చేస్తున్నాడు. ఇందులో నయనతార హీరోయిన్. 70 ఏళ్ల వయసులో కుర్రాడిలా స్టెప్పులు వేస్తూ కనిపించిన చిరూపై సోషల్ మీడియాలో తీవ్రమైన ట్రోలింగ్ వచ్చింది. ఈ మూవీ తర్వాత శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ సినిమా,

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



# హైదరాబాద్ సహా తూర్పు జిల్లాల్లో మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్ సహా తెలంగాణలోని తూర్పు జిల్లాల్లో రాగల మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే, రాష్ట్రంలో చలిగాలుల ప్రభావం అంతగా ఉండకపోవచ్చని ప్రాథమికంగా తెలిపింది.ప్రస్తుతం బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన ఈ వాయుగుండం కారణంగా అండమాన్ నికోబార్ దీవులకు భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. నవంబర్ 24, 25 తేదీల్లో అక్కడ గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని పేర్కొంది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, నవంబర్ 23 వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించింది. పోర్ట్ బ్లెయిర్ పోర్టులో మూడో నెంబర్ ప్రమాద హెచ్చరికను జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. అలల ఉద్ధృతి కారణంగా పర్యాటకులు, బోట్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా, తెలంగాణ వాతావరణంపై తన అంచనాలతో గుర్తింపు పొందిన 'తెలంగాణ వెదర్‌మ్యాన్' రెండు రకాల అంచనాలను వివరించారు. ఈ వ్యవస్థ ప్రభావంతో ఉత్తర, మధ్య ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోని తూర్పు జిల్లాలు, హైదరాబాద్‌లో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఒకవేళ ఈ పరిస్థితి ఏర్పడటం ఆలస్యమైతే, అది పెను తుపానుగా మారే ప్రమాదం ఉందని, అప్పుడు తెలంగాణలో పొడి వాతావరణంతో పాటు తీవ్రమైన చలిగాలులు వీస్తాయని అంచనా వేశారు



## కెరీర్ రేసులో పరుగులు పెడుతున్న
# మహిళలకు గర్భధారణపై రెడ్ అలర్ట్!

కెరీర్‌లో ముందంజలో ఉండాలనే తపనతో రోజూ 10-12 గంటలు పనిచేస్తున్న యువ మహిళల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఈ తీవ్రమైన వర్క్‌లోడ్ వల్ల శరీరంలో నిరంతరం ఒత్తిడి హార్మోన్ (కార్టిసాల్) స్థాయిలు పెరిగి, గుడ్డు విడుదల ప్రక్రియ (ఓవులేషన్) దెబ్బతినడం, ఋతుచక్రం అస్తవ్యస్తం కావడం సర్వసాధారణమవుతోంది. ఫలితంగా సహజంగా గర్భం దాల్చే అవకాశాలు గణనీయంగా తగ్గిపోతున్నాయని గైనకాలజిస్టులు హెచ్చరిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే — కెరీర్ ఎక్కువగా ఎదిగినంత మాత్రాన గర్భాశయం సంతోషంగా ఉండటం లేదు. ఒకవేళ కష్టపడి గర్భం దాల్చినా సమస్యలు అక్కడితో ఆగడం లేదు. ఎక్కువ గంటల పని, తక్కువ నిద్ర, అనియత ఆహారం వల్ల గర్భస్రావం (మిస్‌క్యారేజ్) రిస్క్ గణనీయంగా పెరుగుతుంది. అంతేకాదు, ప్రీమెచ్యూర్ డెలివరీ, బిడ్డకు తక్కువ బరువు, ఎదుగుదలలో లోపాలు, ప్రీఎక్లాంప్సియా వంటి ప్రమాదకర సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఫర్టిలిటీ నిపుణులు చెబుతున్నారు. శరీరం ఎప్పుడూ "అలర్ట్ మోడ్"లో ఉంటే గర్భంలోని బిడ్డకు కావలసిన పోషకాలు, ఆక్సిజన్ సరిగ్గా అందకపోవడం సహజమే కదా! ఆర్థికంగా బలోపేతం కావడం ఒక ఎత్తు అయితే, శారీరక-మానసిక ఆరోగ్యాన్ని బలిచేయడం మరో ఎత్తు. ఎక్కువ ఒత్తిడి వల్ల థైరాయిడ్ సమస్యలు, PCOS, ఇన్సులిన్ రెసిస్టెన్స్, రోగనిరోధక శక్తి తగ్గడం వంటివి కూడా తోడవుతున్నాయి. ఈ సమస్యలన్నీ కలిసి యువతలో ఇన్‌ఫెర్టిలిటీ రేటును గత ఐదేళ్లలో దాదాపు 30-40 శాతం పెంచేశాయని హైదరాబాద్, బెంగళూరు, ముంబైలోని ప్రముఖ IVF సెంటర్లు తమ డేటా ఆధారంగా చెబుతున్నాయి. కాబట్టి కెరీర్-కుటుంబ సమతుల్యత కోసం ఇప్పట్నుంచే అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. రోజులో కనీసం 7-8 గంటల నిద్ర, సమయానికి ఆహారం, వారానికి 150 నిమిషాల మోడరేట్ ఎక్సర్‌సైజ్, ఒత్తిడి తగ్గించే యోగ-మెడిటేషన్‌లు అలవాటు చేసుకోవడం ద్వారా ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. లక్షలు సంపాదించినా... ఒడిలో బిడ్డ నవ్వు లేకపోతే ఆ సంపాదనకు అర్థం ఉంటుందా అని ఆలోచించుకోవాల్సిన సమయం ఇది!

భద్రాచలం బస్సుకు మేకల గుంపు ఢీ!
# ఇద్దరు 'ప్రయాణికులు' అక్కడికక్కడే మృతి

ఖమ్మం జిల్లా సత్తుపల్లి నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు శనివారం ఉదయం పూసుగుడేం సమీపంలో ఊహించని ఢీకొన్నది. రోడ్డు దాటుతూ వెళ్తున్న మేకల గుంపులోకి బస్సు దూసుకెళ్లడంతో ఘటనస్థలి ఒక్కసారిగా గందరగోళంగా మారింది. బస్సు డ్రైవర్ హడావిడిగా బ్రేకులు వేసినా ఆలస్యం అయిపోయింది. ప్రయాణికులు ఒక్కసారిగా కిటికీల నుంచి తొంగి చూస్తూ ఆశ్చర్యంతో గట్రోళ్లు పెట్టారు. ఈ ఘటనలో రెండు మేకలు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాయి. మిగిలిన మేకలు భయంతో చెల్లాచెదురుగా పరుగులు తీశాయి. బస్సులోని ప్రయాణికులు ఎవరూ తీవ్రంగా గాయపడకపోవడం కొంత ఊరట కలిగించింది. అయితే బస్సు ముందు భాగంలో కొంత నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న సత్తుపల్లి పోలీసులు తక్షణమే స్థలానికి చేరుకున్నారు. మృత మేకల శవాలను పక్కకు తప్పించి రోడ్డును శుభ్రం చేశారు. బస్సు డ్రైవర్‌ను ప్రశ్నించి కేసు నమోదు చేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రాంతంలో తరచూ మేకలు, ఆవులు రోడ్డు దాటడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన మరోసారి గ్రామీణ రోడ్లపై పశువుల నియంత్రణ అవసరాన్ని గుర్తు చేసింది. స్థానిక అధికారులు ఈ మార్గంలో హంపీలు ఏర్పాటు చేయడం లేదా పశువుల కోసం ప్రత్యేక మార్గాలు రూపొందించడం గురించి ఆలోచించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం ట్రాఫిక్ సాధారణ స్థితికి చేరుకుంది.

# ఉల్లి ధర కుప్పకూలింది.. టమాటా, మిర్చి ధరలు మాత్రం ఆకాశమే!



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉల్లిపాయల ధరలు ఒక్కసారిగా దిగొచ్చాయి. హైదరాబాద్‌లోని పలు రైతు మార్కెట్లు, రిటైల్ షాపుల్లో 5 కేజీల ఉల్లి కేవలం 100 రూపాయలకే అమ్ముడవుతోంది. గత వారం వరకు కేజీకి 40-50 రూపాయలుగా ఉన్న ఉల్లి ధర ఇప్పుడు 20 రూపాయలకు చేరింది. ఈ భారీ పతనానికి ప్రధాన కారణం మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భారీ ఎత్తున సరఫరా రావడమే అని వ్యాపారులు చెబుతున్నారు. కానీ ఈ తక్కువ ధర రైతులను మాత్రం తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్, కర్నూలు, కడప జిల్లాల్లో ఎకరాకు 25-30 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా కేజీకి 8-12 రూపాయలు మాత్రమే వస్తోంది. రవాణా ఖర్చు, కూలీ జీతాలు కూడా రాకపోవడంతో చాలా మంది రైతులు ఉల్లి పంటను పొలంలోనే వదిలేస్తున్నారు. కొందరు రోడ్లపై పోసి నిరసన తెలియజేస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అదే సమయంలో మిగతా కూరగాయల ధరలు మాత్రం ఆకాశాన్ని అంటుతున్నాయి. హైదరాబాద్ రైతు బజార్లలో టమాటా కేజీ 50 నుంచి 80 రూపాయల వరకు, పచ్చిమిర్చి 90-110 రూపాయలు, బెండకాయ 70-80 రూపాయలు, బీరకాయ 80 రూపాయలు, వంకాయ 100-110 రూపాయల వరకు పలుకుతోంది. వర్షాభావ పరిస్థితులు, రవాణా ఖర్చు పెరగడం, సరఫరా తక్కువ కావడమే ఈ ధరల పెరుగుదలకు కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. ఒకవైపు ఉల్లి ధర కిందపడి రైతు కన్నీరు, మరోవైపు టమాటా-మిర్చి ధరలు పైకి లాగి గృహిణుల జేబుకు చిల్లు. ఈ ధరల ఒడిదొడుకుల నేపథ్యంలో సామాన్యులు "ఇంటి అడుగుమీద కూర ఏం వండుకోవాలో" అని సతమతమవుతున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతుకు నష్టపరిహారం, వినియోగదారుడికి సరసమైన ధరలు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



# మావోయిస్టు సంస్థకు భారీ దెబ్బ..
## 37 మంది టాప్ నక్సల్స్ పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు

తెలంగాణలో మావోయిస్టు పార్టీకి భారీ షాక్ తగిలింది. ఈ రోజు మధ్యాహ్నం 37 మంది హార్డ్‌కోర్ మావోయిస్టులు రాష్ట్ర పోలీసు శాఖ ముందు లొంగిపోనున్నారు. ఈ ఘటనతో రాష్ట్రంలో నక్సల్ ఉద్యమం మరింత బలహీనపడనుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. గత కొన్ని నెలలుగా పోలీసుల ఒత్తిడి, లొంగిపోయిన వారికి ఇచ్చే పునరావాస ప్యాకేజీలు ఈ నిర్ణయంలో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. లొంగిపోనున్న వారిలో సీనియర్ నేతలు కూడా ఉన్నారు. కేంద్ర కమిటీ సభ్యుడు ఆజాద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు అప్పాసి నారాయణ, ఎర్రాలు వంటి ప్రముఖ మావోయిస్టు నాయకులు ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నాయకులు దశాబ్దాలుగా అటవీ ప్రాంతాల్లో ఆయుధ శిక్షణ, రాజకీయ కార్యకలాపాలకు నడ్డి విరిగిన వ్యక్తులుగా పరిచయం. లొంగుబాటు కార్యక్రమం నేడు మధ్యాహ్నం 3 గంటలకు జరగనుంది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి స్వయంగా ఈ మావోయిస్టులను అధికారికంగా ఆదరించి, వారి లొంగిపోవడాన్ని ప్రకటించనున్నారు. ఈ సందర్భంగా డీజీపీ ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించి, వివరాలను వెల్లడించనున్నారు. ఈ పరిణామంతో రాష్ట్రంలో మావోయిస్టు ఉద్యమం దాదాపు కకావికలమవుతుందని పోలీసు వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. గత రెండేళ్లలోనే వందలాది మంది కేడర్ లొంగిపోవడం, ఎన్‌కౌంటర్లలో మరికొందరు మరణించడంతో పార్టీ బలం గణనీయంగా తగ్గిపోయింది. ఈ లొంగుబాటుతో తెలంగాణలో నక్సలిజం చరిత్రలో కొత్త అధ్యాయం ముగియబోతోందని అంటున్నారు.






# 3 రోజెస్ సీజన్ 2 టీజర్ విడుదల

తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'ఆహా' లో సూపర్ హిట్ అయిన '3 రోజెస్' వెబ్ సిరీస్ ఇప్పుడు రెండవ సీజన్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సీజన్ 2 టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. మొదటి సీజన్‌లో ఇషా రెబ్బా, పాయల్ రాజ్‌పుత్, పూర్ణ ప్రధాన పాత్రల్లో నటించగా.. ఈ సీజన్ 2లో ఇషా రెబ్బాతో పాటు రాశీ సింగ్ మరియు కుషిత కల్లపు కొత్త 'రోజెస్'గా కనిపించనున్నారు. కమెడియన్ వైవా హర్షతో పాటు సత్య కూడా నవ్వులు పూయించడానికి రెడీగా ఉన్నారు. ఎస్.కె.ఎన్ నిర్మాణంలో, కిరణ్ కారవల్ల దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్ డిసెంబర్ 12 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ప్రస్తుతం వైరల్‌గా మారిన ఈ టీజర్‌ను మీరు కూడా చూసేయండి.

# సెగలు పుట్టిస్తోన్న దివ్య

అందాల నదివే.. నన్నందులోన ముంచేసావులే.. అంటూ కామెంట్స్ చేస్తున్నారు కుర్రాళ్లు. రోజూ క్రేజీ ఫోటోషూట్లతో నెట్టింట రచ్చ చేసే దివ్య భారతి.. తాజాగా రెడ్ డ్రెస్ లో షేర్ చేసిన ఫోటోస్ కుర్రాళ్లకు కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ బ్యూటీ నెట్టింట రచ్చ చేస్తుంది. సినిమాలు అంతగా లేకపోయినా ఫోటోషూట్లతో సందడి చేస్తుంది ఈ వయ్యారి.తొలి చిత్రంతోనే నెట్టింట విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఆ తర్వాత తమిళంలో వరుస సినిమాల్లో నటించి స్టార్ డమ్ సొంతం చేసుకుంది. ఇప్పుడు సుడిగాలి సుధీర్ సరసన తెలుగులో ఓ మూవీ చేస్తున్న సంగతి తెలిసిందే. చాలా రోజులుగా వీరిద్దరి కాంబోలో రాబోయే ప్రాజెక్ట్ షూటింగ్ జరుగుతుండగా.. విడుదలైన ఫోటోస్ ఆకట్టుకున్నాయి.ఇదిలా ఉంటే.. ఓవైపు సినిమాలు చేస్తూనే.. మరోవైపు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా రెడ్ డ్రెస్ లో గ్లామర్ ఫోజులతో మతిపోగొట్టేస్తుంది ఈ వయ్యారి. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ నెట్టింట వైరలవుతున్నాయి.